ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

బుధవారం 26 జూన్ 2024

జిల్లాల వార్తలు

పోలీస్‌స్టేషన్‌కు
కూతవేటు దూరంలో చోరీ

- గోడకు కన్నం వేసి కిరాణ షాప్‌లో దొంగతనం
- 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు నగదు అపహరణ

7లో



వానాకాలం.. వ్యాధుల గాలం

సీజనల్ వ్యాధులతో దడ

వాతావరణం మారడంతో విజృంభించే అవకాశం

అప్రమత్తతతోనే నివారణ

పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం కీలకం

సంగారెడ్డి అర్బన్/మెదక్ కల్చరల్, జూన్ 24: వానాకాలం ప్రవేశంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వస్తుంది. భగ్గున మండే వేడి నుంచి చల్లగా మారిపోయింది. వర్షపు చిటపట చినుకులతో ఆహ్లాదంగా ఉన్నా.. జల్లుల మాటున ఎన్నో జబ్బులు కూడా దాగి ఉంటాయి. చల్లని వాతావరణం వైరస్‌ల విజృంభణకు అనుకూలంగా ఉంటుంది. రకరకాల ఇన్ఫెక్షన్‌లు వస్తుంటాయి. వైరల్ జ్వరాలు ఎక్కువవుతాయి. అలాగే, అపరిశుభ్రమైన పరిసరాలు, దోమలతోనూ వ్యాధులు వ్యాపిస్తాయి.

వైరల్ ఫీవర్ అంటే..

వైరల్ జ్వరాలు ఆకస్మాత్తుగా సోకుతాయి. జ్వరం ఎక్కువగా ఉంటుంది 102 డిగ్రీల వరకు జ్వరం ఉంటుంది. ఒక్కొక్కసారి ఇది ఎక్కువగా ఉండవచ్చు. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు ఉండి ఆరోగ్యం బలహీనంగా తయారవుతుంది. కొందరిలో ఒంటిమీద దురద, వాంతులు కొంతమందిలో విరేచనాలు కూడా ఉంటాయి. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటివి వైరస్ కిందకు వస్తాయి. కొన్ని జబ్బులు దోమల ద్వారా, కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వస్తాయి. మరికొన్ని ఇన్‌ఫెక్షన్లు గాలి ద్వారా, శ్వాస ద్వారా కూడా సోకుతాయి. చల్లదనం ఎక్కువవడం వల్ల రక్త నాళాలు ముడుచుకుపోతాయి. దీంతో రక్తం సరఫరా నెమ్మదిస్తుంది. రక్తంలో తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గడంతో రోగనిరోధక శక్తి తగ్గిపోయి వైరస్‌లు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి.

సంవత్సరం	డెంగీ	టైఫాయిడ్	మలేరియా
2021	131	227	02
2022	301	3,543	02
2023	343	2,003	00

పిల్లలకు జ్వరాలు త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది. వైరల్ జ్వరం సోకితే ఒళ్ళు నొప్పులు, జ్వరం, నీరసం, నిస్సత్తువ, గొంతు నొప్పి, ముక్కు కారడం, దగ్గు ఉంటాయి. విష జ్వరాల ప్రభావంతో ఛాతీ పైభాగంలో ఎక్కువగా ఇబ్బంది ఉంటుంది. శ్వాస వ్యవస్థ మీద ఎక్కువ ప్రభావం చూపుతాయి. వైరల్ జ్వరం లక్షణాలు కనిపిస్తే రోగికి ఎక్కువగా కాచి చల్లార్చిన మంచినీళ్లు ఎక్కువగా తాగించాలి శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి. తేలికపాటి తొందరగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వాలి. రోగికి విశ్రాంతినివ్వాలి. నిమ్మ,నారింజ లాంటి సిట్రస్ జాతి ఫలాలు తినిపించాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఖాళీ స్థలాలు, పాత టైర్లు, కుండలు, రహదారుల పక్కన గుంతల్లో నీరు చేరకుండా చూసుకోవాలి.
- దోమలు ఇళ్లలోకి చూసుకోవాలి.
- దోమ తెరల వినియోగం తప్పనిసరి.
- ప్రతీ శుక్రవారం డ్రై-డే పాటించాలి.
- వేడిచేసి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలి.
- పరిశుభ్రమైన తాజా ఆహారాన్నే తీసుకోవాలి
- జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులాంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.



ఏటా పెరుగుతున్న కేసులు

సంగారెడ్డి జిల్లాలో సీజనల్ కేసులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. ప్రదానంగా 2021లో డెంగీ 131 కేసులు, టైఫాయిడ్ 227 కేసులు, మలేరియా రెండు కేసులు నమోదయ్యాయి. 2022లో డెంగీ అత్యధికంగా 301 కేసులు, టైఫాయిడ్ 3,543 కేసులు, మలేరియా రెండు కేసులు నమోదయ్యాయి. 2023లో 343 డెంగీ, టైఫాయిడ్ 2003 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో సుమారు 2,328 మంది ఫైలేరియా బాధితులున్నారని అధికారులు తెలిపారు. ఏటా డెంగీ, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతుండటంతో ప్రజల్లో దడ మొదలైంది. సీజనల్ వ్యాదులు సోకకుండా మున్సిపల్, గ్రామపంచాయతీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖల అధికారులు ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అపరిశుభ్రత నెలకొని దోమలు వృద్ధి చెందుతున్నాయి. పీహెచ్‌సీల డాక్టర్లు, వైద్య సిబ్బంది, హెల్త్ ఎడ్యుకేటర్ల ద్వారా అవగాహన కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. డెంగీ లేదా టైఫాయిడ్ కేసు నమోదైతే ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం హడావుడి చేస్తున్నదని విమర్శలున్నాయి.



సంగారెడ్డిలోని బొబ్బిలికుంటలో మురుగు, చెత్త

జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దూరం



వర్షాకాలంలో చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతుంటారు. వానలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తాజా ఆహారాన్ని వేడిగా తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జలుబు, జ్వరం వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వేడినీళ్లలో ఉప్పువేసి పుక్కిలించాలి. దగ్గు, దమ్ము ఉన్నవారు జాగ్రత్త తీసుకోవాలి. డెంగీ, మలేరియా లాంటి వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- తిరుమలేష్, పిడియాట్రీషిన్, మాతా శిశు సంరక్షణ కేంద్రం, మెదక్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సీజనల్ వ్యాధులపై
అప్రమత్తంగా ఉండాలి

- ధరణి సమస్యలు నెలాఖరు లోపు పరిష్కరించాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రేగోడు జూన్ 25: సీజనల్ వ్యాధులపై వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. రేగోడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రత ప్రాధాన్యం, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని పేర్కొన్నారు. డాక్టర్లు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టిసారించాలని అన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పెషల్‌డ్రైవ్

జిల్లావ్యాప్తంగా ధరణి సమస్యలను పరిష్కరించేందుకే స్పెషల్‌డ్రైవ్ చేపట్టామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రేగోడులోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ధరణిలో సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 100 దరఖాస్తులను పరిష్కరించామని, పెండింగ్‌లో ఉన్న 10 దరఖాస్తులన రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ బాలలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు.

బాలిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యం

రేగోడులోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదిని సందర్శించి విద్యార్థినులను ప్రశ్నలు అడిగి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. కూరగాయలు, పప్పుదినుసుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, నాణ్యమైన మెనూ అందించాలని సూచించారు. బాలికలకు నాణ్యమైన విద్య అందించడమే కేజీబీవీల లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ ఫిరోజ్, కేజీబీవీ ప్రతేకాధికారి స్వయంప్రభ, వైద్యాధికారులు సుష్మ, మురళి, స్టాఫ్‌నర్స్ సునంధ, పారమ్మ, ఫార్మాసిస్టు రవీందర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల వివాదానికి తెర

రూ.10 కోట్ల సర్కారు స్థలం సేఫ్

- కబ్జాదారుల చెర నుంచి కాపాడిన కలెక్టర్
- బస్తీ దవాఖానా నిర్మాణానికి చర్యలు
- రూ. 20 లక్షలతో పనులకు శ్రీకారం

సంగారెడ్డి టౌన్, జూన్ 25 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రూ.10 కోట్ల విలువైన సర్కారు స్థలంపై వివాదానికి తెరపడింది. ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో మే 28న 'రూ.10 కోట్ల సర్కారు భూమికి ఎసరు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ క్రాంతి స్పందించారు. వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమణ నుంచి రక్షించి, బస్తీ దవాఖానాను నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.20 లక్షలు తక్షణమే మంజూరు చేశారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చకచకా పనులను చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం బస్తీ దవాఖానా పనులను ప్రారంభించారు. ఎవరైనా అడ్డుకునేందుకు యత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పట్టణ సీఐని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

పదేళ్లుగా వివాదం

సంగారెడ్డిలోని సంజీవనగర్ కాలనీలో ట్రాన్స్‌కో కార్యాలయం పక్కన ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వెయ్యి గజాల స్థలంపై పదేళ్లుగా వివాదం కొనసాగుతున్నది. 244 సర్వే నంబర్‌లో ఉన్న ఈ సర్కారు భూమి విలువ రూ.10 కోట్లు ఉంటుంది. ఇదే సర్వే నంబర్‌లో 1959 సెప్టెంబర్ 18న అప్పటి మంత్రి సంజీవయ్య పేదలకు 200 గజాల చొప్పున స్థలాలను పంపిణీ చేశారు. 1000 గజాలు ప్రభుత్వ అవసరాల నిమిత్తం వదిలేశారు. 15 సంవత్సరాల క్రితం ఈ స్థలాన్ని ఓ విశ్రాంత ఉద్యోగికి కేటాయించినట్లు రికార్డులు సృష్టించి, ఓ రియల్టర్‌కు విక్రయించినట్లు సమాచారం. స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి భవనాన్ని నిర్మించేందుకు పదేళ్ల క్రితం మున్సిపల్ నుంచి అనుమతులు పొందారు. విషయం తెలుసుకున్న సంజీవనగర్ కాలనీవాసులు అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సీరియస్ కావడంతో మున్సిపల్ కమిషనర్ అనుమతులను రద్దు చేశారు. గత నెల 28న ఓ వ్యక్తి ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేశానని పేర్కొంటూ చదును చేస్తుండగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో కలెక్టర్ స్పందించారు. పదేళ్లుగా కబ్జాదారుల చెరలో ఉన్న స్థలం వివాదానికి కలెక్టర్ పరిష్కారం చూపడంపై కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ బస్తీ దవాఖానా నిర్మించడంతో సంజీవనగర్, మార్క్సనగర్, నారాయణరెడ్డి కాలనీ, సాయిమాణిక్‌నగర్, శాంతినగర్, చాణక్యపురి కాలనీ ప్రజలకు వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు.



వివాదాస్పద స్థలంలో బస్తీ దవాఖానా నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులు



సంగారెడ్డి మెదక్

రూ.10కోట్ల భూమికి ఎసరు

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం (ఫైల్)



అల్లాదుర్గంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం

సెలవులు ముగిసినా...
తెరుచుకోని కేజీబీవీ

- నిరాశతో వెనుదిరుగుతున్న విద్యార్థులు
- మరమ్మతు పనులు నడుస్తున్నాయి : స్పెషలాఫీసర్

అల్లాదుర్గం, జూన్ 25 : పాఠశాలలు తెరుచుకుని రెండు వారాలవుతున్నా మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం తెరుచుకోలేదు. విద్యాలయంలో పాఠశాలస్థాయి విద్యార్థులు 225 మంది, కళాశాల స్థాయివారు 80 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. పాఠశాలలన్నీ నడుస్తుండగా కేజీబీవీలో తరగతులు ప్రారంభం కాకపోవడంతో తమ పిల్లలు వెనుబడుతారని తల్లిదండ్రులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులను ప్రశ్నిస్తే మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని అంటున్నారని తెలిపారు. తరగతులు జరగకపోవడంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ టీచర్లు కూడా గైర్హాజరవుతున్నారని తెలుస్తున్నది. ప్రతీరోజు ఒకరిద్దరు మాత్రమే వస్తున్నారని, అది కూడా సమయపాలన లేకుండా ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పుకునే అధికారులు పాఠశాల తెరుచుకోక 15 రోజులు కావస్తున్నా స్పందించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అల్లాదుర్గం కేజీబీవీలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే..



మరమ్మతులు జరుగుతుండటంతో కేజీబీవీలో తరగతులను నిర్వహించడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవించాం. రెండు రోజుల్లో తరగతులను ప్రారంభిస్తాం. వివిధ పరీక్షలకు హాజరవుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాఠశాలకు రావడం లేదు. నాన్‌టీచింగ్ టీచర్లు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు విధుల్లో ఉంటారు.

-స్రవంతి, కేజీబీవీ ప్రత్యేకాధికారి



రెచ్చిపోతున్న
మట్టి మాఫియా

- శివంపేటలో యథేచ్ఛగా దందా
- ప్రైవేట్ వెంచర్లకు విచ్చలవిడిగా తరలింపు
- రూ.లక్షలు గడిస్తున్న దళారులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు

7లో

ఎస్జీటీల పదోన్నతులకు వెబ్‌ఆప్షన్లు

- నేడో, రేపో పదోన్నతి ఉత్తర్వులు జారీ

సంగారెడ్డి అర్బన్, జూన్ 25 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తుది దశకు చేరింది. రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిగా ముగియనున్నది. ఇప్పటివరకు గెజిటెడ్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తయిన సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు మాత్రమే మిగిలాయి. రెండు, మూడు రోజుల్లో ఆ ప్రక్రియ కూడా పూర్తికానున్నది. జడ్పీ యాజమాన్య పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియలో భాగంగా మంగళవారం వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రారంభమైంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే బుధవారం సాయంత్రం లేదా గురువారం ఎస్జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. నెలాఖరు వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తిచేయాలని విద్యాశాఖ భావిస్తున్నది.



వాన ఎప్పుడొచ్చేనో?

వర్షాకాలంలో ఆరంభంలోనే కరుణించిన వరుణుడు మాయమయ్యాడు. మళ్లీ కరుణిస్తాడనే ఆశతో రైతులు పత్తి చేలల్లో కలుపు తీయిస్తున్నారు.


మాదకద్రవ్యాలను అరికట్టడానికి జాగిలాల సేవలు : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 25 : మాదకద్రవ్యాల ఉనికిని కనుగొనడానికి పోలీసు జాగిలాలను రంగంలోకి దింపుతామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. జిల్లా డాగ్‌స్క్వాడ్ పనితీరును మంగళవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మరిన్ని సత్ఫలితాలు రాబట్టడానికి జగిలాల సేవలను వినియోగించుకుంటామని తెలియజేశారు.




జాగిలాలను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

రేపే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ (తెలుగు 3D)
శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ (3D తెలుగు) ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D
GLOBAL CINEMAS RELEASE

రేపే బ్రహ్మాండమైన విడుదల



వరంగల్ · నిజామాబాద్ · ఖమ్మం · మహబూబ్‌నగర్ · కరీంనగర్ · నల్గొండ · ఆదిలాబాద్ · మెదక్ · రంగారెడ్డి · రాయచూర్

కాజీపల్లి కాలుష్య సమస్యలపై అధికారులకు ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాజీపల్లి వాసులు

జిన్నారం, జూన్ 25: కాజీపల్లి పరిధిలో నెలకొన్న పరిశ్రమల కాలుష్య సమస్యపై గ్రామానికి చెందిన నాయకులు రమాకాంత్, కుమార్ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణలకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కొన్ని పరిశ్రమలు నియంత్రన పాటించ కుండా వ్యర్థ జలాలను వదిలి వేస్తున్నాయని, వాయు కాలుష్యం కూడా అధికంగా ఉందని తెలిపారు. కాగా సమస్యను ఎంపీపీ రవీందర్‌గౌడ్ పీసీబీ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై గ్రామస్థుల సహకారం, జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వరకు వినతిపత్రాలు అందజేసి, తీరు మారకపోతే ఆందోళనలు, కోర్టులో కేసుల దాఖలు చేపడుతామని రామాకాంత్ తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌లో భూములను కోల్పోతున్న
రైతులకు పరిహారం చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోతులబోగుడ రైతులు

శివ్వంపేట, జూన్ 25: ట్రిపుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పోతులబోగుడ గ్రామానికి చెందిన 53 మంది రైతులు, తాజా మాజీ సర్పంచ్ హరికిషన్‌రావుతో కలిసి మంగళవారం శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో ట్రిపుల్‌ఆర్ తహసీల్దార్లను కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పోతులబోగూడ గ్రామంలో 53 మందికి చెందిన 44 ఎకరాల భూమి రీజనల్ రింగ్‌రోడ్ నిర్మాణంలో కోల్పోతున్నట్టు తెలిపారు. సర్వే నెంబరు ప్రాతిపదికన కాకుండా భూములను కాస్తు చేసుకుంటున్న, ట్రిపుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న చిన్న, సన్నకారు బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ట్రిపుల్‌ఆర్ తహసీల్దార్లు సోమేశ్వర్ కుమార్, సత్యనారాయణలను రైతులు కోరారు. అనంతరం మెదక్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షఫీయొద్దీన్, రైతులు పాల్గొన్నారు.

FAMILY ENTERTAINMENT నేడే చూడండి



పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 11.00am
లక్ష్మీకళ సినిప్లెక్స్ - మూసాపేట్ 11.30am
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
PARAM JYOTHI FILMS 9848028739

SWEET WONDERFUL LOVE STORY నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,6.00 Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.45,7.15
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.00,6.05
SUNCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

BLOCKBUSTER SUPERHIT నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND 11.00,2.15,6.00,9.00
మహాలక్ష్మి కాంప్లెక్స్ ఎ/సి - కొత్తపేట 11.15,6.15
RUSHIKESHWAR FILM DISTRIBUTOR 9849076540

చికిత్స పొందుతూ మహిళ మృతి



శ్రీరాం విఠవ్వ (ఫైల్)

కల్హేర్, జూన్ 25: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం విఠవ్వ(65) భర్త చనిపోయాడు. కుమారుడు వీఆర్‌వోగా దూర ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తుండడంతో మానసికంగా కుంగిపోయింది. దీంతో ఈనెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటిపక్క వారు గమనించి విఠవ్వను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిందని చెప్పారు. కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కల్హేర్ ఏఎస్‌ఐ అంజయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైర్లు చోరీ



గవ్వలపల్లితండా శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్, తూప్రాన్‌లో కేబుల్ వైర్లు చోరీ జరగగా మిగిలిన స్టాటర్లు

చిన్నశంకరంపేట, జూన్ 25: ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైర్లను చోరీకి పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి తండా శివారు కొయ్యమర్రి వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. జంగరాయి గ్రామానికి చెందిన రైతులు గవ్వలపల్లితండా శివారులో వ్యవసాయం చేస్తున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్లను దొంగలించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో బోరు మోటార్ల కేబుల్ వైర్ల చోరీ

తూప్రాన్, జూన్ 25: తూప్రాన్ పట్టణ పరిధిలో పెద్దచెరువు ఆయకట్టు బోరు మోటార్ల కేబుల్ వైర్లు సోమవారం రాత్రి చోరీకి గురయ్యారు. గుర్తు తెలియని దొంగలు పెద్దచెరువు కట్టకింద ఉన్న బోర్ల కేబుల్ వైర్లు కట్ చేసి చోరీ చేసుకెళ్లారు. సుమారు 15 మంది రైతులకు మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న సమయంలో బోరు వైర్ల కేబుల్ వైర్లు చోరీకి గురవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాల్లోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలి



చిట్కుల్‌లో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి

చిలప్‌చెడ్, జూన్ 25: వర్షాకాలంలో రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, గ్రామాల్లోని వీధులన్నీ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల సెగ్రిగేషన్‌షెడ్, డంపింగ్‌యార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వాటిల్లో ఆయిల్‌బాల్స్ వేస్తుండాలని, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, సెగ్రిగేషన్ షెడ్‌లో వర్మీ కంపోస్టు తయారు చేయాలని కార్మికులకు, కార్యదర్శికి సూచించారు. ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

డ్రమ్‌సీడర్‌తో రైతులకు లాభాలు

● మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ



డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెల్దుర్తి, జూన్ 25: వరిసాగులో డ్రమ్ సీడర్‌తో రైతులకు లాభాలు వస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతి ద్వారా వరి సాగుకు ఎకరానికి 8 నుంచి 10 కిలోల వరి విత్తనాలు నాటుకునేందుకు సరిపోతాయని తెలిపారు. ఒకరోజు మూడు ఎకరాల వరకు విత్తనం వేసుకోవచ్చని సూచించారు. మొక్కకు మొక్కకు సరైన దూరం ఉంటుందన్నారు. డ్రీమ్ సీడర్‌ను వాడడం వల్ల సమయం ఆదా అవుతుందని, ఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి వస్తుందని సూచించారు.

రేపు అందోలులో భూ నిర్వాసితుల సమావేశం

పుల్‌కల్, జూన్ 25: చౌటకూర్ మండలంలోని ఐదు గ్రామాల శివారులో త్రిబుల్ ఆర్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో 27న సమావేశం నిర్వహిస్తున్నట్లు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయమై అందోలులోని నీటిపారుదలశాఖ అతిథి గృహంలో గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పరిహారం విషయమై రైతులు తమ సందేహాలు, సలహాలు తెలియజేయాలని సూచించారు. మండలంలోని శివంపేట, వెండికోలు, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోలు గ్రామాల శివారులో భూములు కోల్పోతున్న రైతులు మాత్రమే ఈ సమావేశానికి హాజరుకావాలని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీ

- గోడకు కన్నం వేసి కిరాణ షాప్‌లో దొంగతనం
- 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు అపహరణ



దొంగలు కన్నం వేసిన ప్రాంతాన్ని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయిస్తున్న దృశ్యం

పాపన్నపేట, జూన్ 25: పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కిరాణాషాపులో దొంగతనం జరిగింది. గోడకు కన్నంపెట్టిన దుండగులు బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదును దోచుకెళ్లిపోయారు. ఈ సంఘటన పాపన్నపేట మండల కేంద్రంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పాపన్నపేటకు చెందిన కూకుట్ల సత్యనారాయణ ప్రధాన రోడ్డు పక్కన రెండేళ్లుగా వీరభద్ర కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 9.30 గంటలకు రోజులాగే తన కుమారుడు దుర్గాప్రసాద్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి లోపలికి వెళ్లాడు. కౌంటర్ వద్ద సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా.. దుకాణం వెనక వైపు ఉన్న గోడకు కన్నం వేసి ఉన్నది. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారమందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దుకాణానికి వెనుక వైపు ఉన్న గోడకు గునపంతో కన్నం వేశారు. ఆ కన్నం నుంచి లోపలికి ప్రవేశించి నగదు కౌంటర్‌ను ధ్వంసం చేసి.. అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిపోయారు. ఆధారాలు దొరకకుండా డీవీఆర్ బాక్సు, టీవీని కూడా ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం సిబ్బంది, జాగిలంతో ఆధారాలు సేకరిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చోరీ జరగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముస్త్యాలలో మరో సైబర్ మోసం

- ఓ వ్యక్తి నుంచి రూ.80 వేలు హాంఫట్

చేర్యాల, జూన్ 25: సైబర్ మాయగాళ్ల ఉచ్చులోపడి చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి మరో వ్యక్తి రూ.80 వేలు పోగొట్టుకున్నాడు. రెండురోజుల క్రితం ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.13.50 లక్షలు కోల్పోయిన విషయం మరవకముందే అదే గ్రామానికి చెందిన యెనిశెట్టి అమర్‌నాథ్ రూ.80 వేలు కోల్పోయాడు. తన వాట్సప్‌కు వచ్చిన పీఎం కిసాన్ పీఎస్‌కే లింక్‌ను ఓపెన్ చేయడంతో అతడి బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయమయ్యాయి. దీంతో ఆందోళనకు గురైన అమర్‌నాథ్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేట బాలాజీ బార్‌లో అగ్నిప్రమాదం

- సుమారు రూ.15 లక్షలు ఆస్తి నష్టం



ఎక్స్‌కవేటర్ సహాయంతో బార్ షెటర్‌ను పగులగొడుతున్న సిబ్బంది

సిద్దిపేట క్రైం, జూన్ 25: సిద్దిపేట పట్టణంలోని బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్‌లో కౌంటర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం ఉదయం మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసిపడుతుండడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా.. అదుపులోకి రాలేదు. దీంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో షట్టర్‌ను పగులగొట్టి.. తర్వాత ఫైరింజన్ సాయంతో మంటలను ఆర్పేశారు. అప్పటికే బార్‌లో ఉన్న విస్కీ బాటిళ్లు, కబోర్డ్స్, కౌంటర్‌లో ఉన్న డబ్బులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ సమయంలో బార్‌లో ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు మల్లారెడ్డి తెలిపారు.

అమ్మో.. ఎంత పెద్ద పామో..!



నాగుపామును పట్టుకున్న దృశ్యం

చేగుంట, జూన్ 24: చేగుంట మండలం అనంతసాగర్ గ్రామ శివారు నల్లకుంట సమీపంలోని వ్యవసాయ పొలంలో ఓ భారీ నాగుపామును పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రైతు పెండ్యాల శంకర్ పొలంలో భారీ నాగుపాము కనిపించింది. పాములు పట్టే నైపుణ్యం కలిగిన చేగుంట గ్రామానికి చెందిన ఎర్ర నాగులుకు సమాచారమందించారు. అతను వచ్చి పొలంలో సంచరిస్తున్న ఎనిమిది అడుగుల భారీ నాగుపామును పట్టుకుని, సమీప అడవిలో వదిలేశాడు. ఇంత పెద్ద నాగుపామును చూడడం ఇదే మొదటిసారి అని స్థానికులతో పాటు చుట్టుపక్కలవారు తెలిపారు.

27న భవిష్యనిధి సమస్యలపై శిబిరాలు

- పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు, జూన్ 25: భవిష్యనిధి (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ఈ నెల 27న మూడు వేర్వేరు ప్రాంతాల్లో మెగా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పటాన్‌చెరు భవిష్యనిధి ప్రాంతీయ కమిషనర్ విశాల్‌అగర్వాల్ తెలిపారు. చందానగర్ హైహోంజ్యువల్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో, పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఆల్కా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో, సదాశివపేట మండలం చందాపూర్ గ్రామంలోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9-30 నుంచి సాయంత్రం 5-45వరకు శిబిరాల్లో ఖాతాదారుల ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

డ్రిప్ స్ప్రింక్లర్లపై రైతులకు సబ్సిడీ

- మెదక్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య

మాసాయిపేట, జూన్ 25: జిల్లాలో ఆయిల్ పామ్ పండ్ల తోటలు, కూరగాయ తదితర పంటలు పండించే సన్న చిన్న కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీని అందజేస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమల శాఖ అధికారి డి నర్సయ్య వెల్లడించినట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలతో మీసేవ కేంద్రాల్లో ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి రజిత తెలిపారు.



శివంపేట శివారు వీర హనుమాన్ ఆలయం వద్ద ఏర్పడిన భారీ గుంతలు



శివంపేట క్రీడా ప్రాంగణంలో మట్టిని ట్రాక్టర్ల ద్వారా డంప్ చేస్తున్న దృశ్యం



శివంపేటలో నిల్వ చేసిన మట్టి కుప్పలు

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

శివంపేటలో యథేచ్ఛగా దందా

- ప్రైవేట్ వెంచర్లకు విచ్చలవిడిగా తరలింపు
- రూ.లక్షలు గడిస్తున్న దళారులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు

పుల్‌కల్, జూన్ 25: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో మట్టి మాఫియా దందా జోరుగా సాగుతున్నది. రెవెన్యూ, పోలీసు అధికారుల అండదండలతో మట్టి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. శివంపేట గ్రామానికి ఆనుకుని సహజ సిద్ధంగా భారీ ఎత్తైన కొండలు, గుట్టలు ఉన్నాయి. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారికి ఆనుకుని శివంపేట నుంచి చౌటకూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ వెంచర్లు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఆ వెంచర్లలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన ఎర్ర మట్టిని రాత్రీ, పగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. స్థానికులెవరైనా అడ్డుకునేందుకు యత్నిస్తే తాము రెవెన్యూ, పోలీసు అధికారులకు నెలనెలా మామూళ్లు అందజేస్తున్నామని బుకాయిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

శివంపేట గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ కార్యకర్తలు నిబంధనలకు విరుద్ధంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోకపోయినప్పటికీ, తాము అధికార పార్టీ కార్యకర్తలమన్న ధీమాతో రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్‌తో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. గ్రామ శివారులోని కంకర మిషన్ ప్రాంతం, వీరహనుమాన్ ఆలయ ప్రాంతంలో ఉన్న గుట్టలు, కొండలను పూర్తిగా తవ్వేస్తున్నారు. ఇదేమి దందా అని ఎవరైనా స్థానికులు అడ్డుకుంటే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మట్టి అక్రమ దందా కోసం ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్లు, భారీ టిప్పర్లు, ట్రాక్టర్లను కొనుగోలు చేసుకుని మరీ వ్యాపారం చేస్తున్నారు. కొండలు, గుట్టల నుంచి తవ్విన మట్టిని తమకు అనువైన ప్రదేశంతో పాటు గ్రామ శివారులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి అవసరమైన వారికి, ప్రైవేట్ వెంచర్లకు, సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట తదితర ప్రాంతాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా తమ గురించి ఎవరికి చెప్పినా భయపడేది లేదని, ప్రతినెలా రెవెన్యూ, పోలీసు ఇతర అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతున్నామని మట్టి మాఫియా నిర్వాహకులు చెప్పడం విస్మయం కలిగిస్తున్నది. ఈ విషయమై తహసీల్దార్ ఈశ్వరీరాణిని సంప్రదించగా ప్రతీరోజు భూముల రిజిస్ట్రేషన్లు ఇతరత్రా పని ఒత్తిడి కారణంగా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తనకు సమాచారం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రకృతి ప్రసాదించిన కొండలు, గుట్టలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎక్స్‌కవేటర్‌తో మట్టిని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం



మట్టిని తరలిస్తున్న టిప్పర్

మట్టి మాఫియాను అడ్డుకోవాలి



శివంపేట గ్రామ శివారులో మట్టి మాఫియా తరలింపును అడ్డుకోవాలి. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అదేపనిగా మట్టి దందా చేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గ్రామ శివారులో ఎక్కడచూసినా డంప్ చేసిన మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

- ఎండీ అలీం, ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభానికి చర్యలు

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ

మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 25: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 5 నుంచి 6 ఏళ్లుగా పిల్లల సంక్షేమం కోసం కృషి చేసిన ప్రముఖమైన స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి సెంటర్‌లో తాగునీరు, అవసరమైన మేర టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు మొదలగు పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ, పట్టణాల్లో ఉన్న 1 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను కేంద్రాల్లో రిజిస్టర్ చేయించి, వారికి రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, సిద్దిపేట జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులకు మంచి అవకాశం

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



అడ్మిషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 25: రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం ఆయా పాఠశాలలకు సంబంధించిన అడ్మిషన్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మూడు పాఠశాలల్లో బాలురకు 60 సీట్లు, బాలికలకు 60 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థుల ఎంపిక మూడుదశల్లో ఉంటుందని తెలిపారు. మొదటి దశలో మండలస్థాయి ఎంపిక ఈ నెల 21 నుంచి 25 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహిస్తామన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రెండో దశలో ఈనెల 29న జిల్లాస్థాయి ఎంపిక జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 8.30 గంటల నుంచి జరుగుతుందని చెప్పారు. ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేసి జూలై 8వ తేదీ నుంచి 12 వరకు హకీంపేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక టెస్ట్‌కు పంపిస్తారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నాగేందర్, తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.హరిబాబు సమీకృత జిల్లా కార్యాలయంలోని కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మద్యం ప్రియులకు అడ్డాగా కేజీబీవీ



అల్లాదుర్గంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనం



భవనంలోని ఓ గదిలో దర్శనమిస్తున్న మద్యం బాటిళ్లు (వృత్తంలో)

అల్లాదుర్గం, జూన్ 25: బడులు గుడిలతో సమానమంటారు. అలాంటి భవనాలనే మద్యం ప్రియులు అడ్డాగా మార్చారు. ఇదేం పని అని ప్రశ్నిస్తే.. భవన నిర్మాణ కార్మికులని, రాత్రివేళలో సేవిస్తున్నారని పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది సెలవిస్తున్నారు. అల్లాదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సంబంధించిన కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ భవనం కొంతకాలంగా మద్యం ప్రియులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలల సెలవు కదా.. అని స్థానికులు పట్టించుకోలేదు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. అయితే ఈ భవనానికి సమీపంలో ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీ ఉన్నాయి. మద్యం ప్రియులు మద్యం మత్తులో విద్యార్థులపై ఏదైనా అఘాయిత్యం చేస్తే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్గల్ విద్యాధరిలో శ్రావణ నక్షత్ర పూజలు

- వైభవంగా వేంకటేశ్వరస్వామికి విశేష పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

వర్గల్, జూన్ 25: వర్గల్ విద్యధరి క్షేత్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, విశేష పూజలతో పాటు లక్ష తులసి పూజ నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. అనంతరం భక్తులు క్షేత్రంలోని విద్యా సరస్వతీ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ మహా అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఖమ్మంపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు స్వాధీనం



ఇళ్లలోని సామాను బయటపెట్టిస్తున్న అధికారులు

కొండపాక, జూన్ 25: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనధికారికంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించి అధికారులు ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఇందులో 41 ఇళ్లను అర్హులకు కేటాయించారు రెండో జాబితాలో 19 ఇళ్లను తర్వాత పంపిణీ చేస్తామని అనుకున్నారు. కానీ చేయకపోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. ఎవరికీ కేటాయించని ఇళ్లలో గ్రామానికి చెందిన పలువురు నివాసముంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో నోటీజులు అందజేశారు. ఖాళీ చేయమని చెప్పినా చేయకపోవడంతో మంగళవారం తహసీల్దార్ దిలీప్‌నాయక్ ఆధ్వర్యంలో త్రీ టౌన్ పోలీసుల సహకారంతో ఇళ్లల్లో అక్రమంగా ఉంటున్న వారి ఇళ్ల తాళాలు పగులగొట్టి సామాను బయటపెట్టారు. అనంతరం తాళాలు వేసి ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 25: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి 1,534 దరఖాస్తులు స్టేజ్‌ల వారీగా త్వరితగతిన ప్రణాళికాబద్ధంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ గుల్షన్‌సింగ్, జిల్లా పరిశ్రమశాఖ మేనేజర్ కృష్ణమూర్తి, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు మెప్మా పీడీ ఇందిరా, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, బీసీ అధికారి నాగరాజ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం చేస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 25: నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి భరోసానిచ్చారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల విషయంలో జరుగుతున్న అన్యాయం గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు చెప్పిన విషయాలను విన్న వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని హామీఇచ్చారని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ఆరా తీస్తామని, నామినేటెడ్ పదవుల్లో అందరికీ న్యాయం జరిగేలా చూడడంతో పాటు గజ్వేల్ పరిణామాలపై రిపోర్టును సేకరించి, అధిష్ఠానానికి నివేదిస్తామని తెలిపినట్లు తెలిసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అందరికీ సమన్యాయం చేస్తామని పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామన్నారు. నామినేటెడ్ పదవుల్లో అందరికీ సమ ప్రాధాన్యత దక్కేలా చూస్తామని హామీఇచ్చినట్లు తెలిసింది. దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో ఫోన్లో మాట్లాడిన శ్రీకాంత్ రావు, మల్లారెడ్డిలు పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలిపారు. అందరినీ కలుపుకుపోతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అన్నివిధాలుగా అధిష్ఠానం అండగా ఉంటుందని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించేలా చూసుకుంటామని హామీఇచ్చారు. వారితో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, న్యాయవాది గోపాలరావు, కాంగ్రెస్ గజ్వేల్ మండలాధ్యక్షుడు బయ్యారం మల్లారెడ్డి, కాంగ్రెస్ ములుగు మండలాధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్, తీగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, ఛాట్లపల్లి మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు ఉన్నారు.

గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారింది



ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు

మిరుదొడ్డి, జూన్ 25: గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందని మిరుదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఫహీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మిరుదొడ్డి మండలంలోని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామపంచాయతీలకు నిధులను మంజూరీ చేయాలని ఎంపీడీవో గణేష్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొన్నినెలలుగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు(ఎస్ఎఫ్‌సీ), కేంద్ర ఆర్థిక సంఘం 15వ ఫైనాన్స్ నిధులు జమకాకపోవడంతో గ్రామపంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు జీతాలు, డీజిల్ చార్జీలు, ట్రాక్టర్ నిర్వహణ, కరెంట్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందన్నారు. ఇతర పనులకు అప్పులుచేసి తాము బిల్లులను చెల్లించామని తెలిపారు. దీనివల్ల తాము మానసిక ఆవేదనకు గురవుతున్నామని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి గ్రామపంచాయతీలకు నిధులను మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, మమత, రవీందర్, అశోక్, యాదగిరి, ఉషా, వంశీ, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పోషకాలు అందించాలి



చిన్నశంకరంపేట అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

చిన్నశంకరంపేట, జూన్ 25: పిల్లల ఎదుగుదలకు పోషకాహారాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి పేర్కొన్నారు. మంగళవారం గ్రోత్ మేళా కార్యక్రమంలో భాగంగా చిన్నశంకరంపేట అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి, పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. 0-5 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ ద్వితీయ, తృతీయ తరగతులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 25: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం తరగతులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30. నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బీఏ, బీబీఏ, బీకాం తరగతులు జరుగుతాయని, అదే విధంగా మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సైన్స్ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫామ్, ఐడెంటిటీ కార్డుతో హాజరు కావాలని తెలిపారు.

గిరిజన వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూన్ 25 : సంగారెడ్డిలోని పాత డీఆర్డీఏ కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వ గిరిజన వసతి గృహంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వసతి గృహ సంక్షేమాధికారి శోభ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ 3వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు 100 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. వసతి గృహంలో చేరాలనుకునే వారు ఆధార్, బోనఫైడ్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు.

'రైతు నేస్తం'.. సాగు సమస్యలకు పరిష్కారం

- వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి, మెదక్ జిల్లాల అధికారులు, రైతులు

కొండాపూర్, జూన్ 25: సీజన్ పంటలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతీ వారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ రైతు వేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలు సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని సూచించారు. క్రాప్ పంటలపై వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సూచించారు. రైతుభరోసా ఆన్‌లైన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మారెపల్లిలో జరిగిన క్షేత్రస్థాయి పంటసాగు నమోదును ఆమె పరీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంబికా, ఎంవోలు గణేష్, ప్రతిభ, తహసీల్దార్ అనిత, డీటీ ప్రదీప్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



కొండాపూర్: వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, అధికారులు, రైతులు

అధికారులు ప్రవీణ, లావణ్య, వినోద్, నవీన్‌కుమార్, ఏఈవోలు ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, భూమేష్ రైతులు కిషన్, మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, సంజీవరెడ్డి, జమీర్, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులకు భూసార పరీక్షలకు సంబంధించిన కార్డులను అందజేశారు.

హుగ్గెల్లి రైతువేదికలో..

జహీరాబాద్, జూన్ 25: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతునేస్తంతో రైతుల సమస్యలకు పరిష్కారం లభించనుందని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం హుగ్గెల్లి రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పంటలసాగుతో పాటు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతు భరోసాపథకం కోసం రైతుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారని, వారి అభిప్రాయాల ఆధారంగానే రైతుభరోసా పథకానికి రూపకల్పన జరుగుతుందనే విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్ వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ

వానకాలం పంటలపై అవగాహన

కొల్చారం, జూన్ 25: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో వానాకాలం పంటలపై అవగాహన కల్పించారు. కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన రైతాంగం హాజరై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వర్షాకాలం వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్ వారిచే వివిధ యూట్యూబ్ వీడియోలను ప్రదర్శించారు. అంతేగాకుండా రైతులతో నేరుగా చర్చించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా వానాకాలం సాగుకు సంబంధించి రైతులకు ఆర్థికంగా సహాయం అందించే విధంగా రైతు భరోసా కార్యక్రమంద్వారా ఆర్థిచేయూత అందించే ఉద్దేశంతో



కొల్చారం రైతువేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు

రాష్ట్రస్థాయిలో విధివిధానాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. అలాగే ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తే ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరుతుందనే అంశాలపై రైతులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి గోవిందు, సహాయ సంచాలకులు పుణ్యవతి, మెదక్ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, కౌడిపల్లి, మెదక్ డివిజన్ వ్యవసాయ అధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు.

రామాయంపేట రైతు వేదికలో..

రామాయంపేట, జూన్ 24: ప్రస్తుత సీజన్లో ఏ రకమైన పంటలు సాగు చేయాలనే విషయమై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం రామాయంపేట రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో లాభాలు ఆర్జించే విధానాలను తెలియ జేశారు. చీడ పీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపైన వీడియోలను ప్రదర్శించారు.అనంతరం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు వసంత సుగుణ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గూర్చి వివరించారు. కార్యక్రమంలో మండల అధికారి రాజ్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

మద్యం అక్రమ తరలింపును అడ్డుకున్న ఎక్సైజ్ పోలీసులు



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

జహీరాబాద్, జూన్ 25: గోవా, ఇతర ప్రాంతాలకు చెందిన మద్యాన్ని కొందరు జహీరాబాద్ మీదుగా రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తుండగా జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని ధ్వంసం చేశారు. మంగళవారం చిరాగ్‌పల్లి వద్ద గల చెక్‌పోస్టువద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. ఈ మేరకు 17.91 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు

వెల్దుర్తి, జూన్ 25: కేజ్‌వీల్ ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ నవతగౌడ్ హెచ్చరించారు. మంగళవారం వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామంలో రోడ్డుపై తిరుగుతున్న రెండు కేజ్‌వీల్ ట్రాక్టర్లను బైండోవర్ చేసి యజమానులు నరేష్, కిష్టయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవతగౌడ్ మాట్లాడుతూ.. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడిపితే ధ్వంసమవుతాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాప్రతినిధులకు ఎల్లవేళలా సహకారం



సదాశివపేట, జూన్ 25: ప్రజలకు సేవ చేసే ప్రజా ప్రతినిధులకు తన సహకారం ఎల్లవేళలా వుంటుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. మంగళవారం సదాశివపేట మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షురాలు యాదవ్వ కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ఎక్కడైనా రోడ్లపై గుంతలు వుంటే వెంటనే పూడ్చివేయాలన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీపీతో పాటు ఎంపీటీసీలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

నారాయణఖేడ్‌లో ఘనంగా అంగారక చవితి వేడుకలు



రేజింతల్ సిద్ధివినాయకుడి సన్నిధిలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 25: నారాయణఖేడ్‌లో మంగళవారం అంగారక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ నెల రెండో పక్షంలో వచ్చే చవితిని సంకష్టహర చవితిగా జరుపుకుంటారు. మంగళవారం సంకష్టహర చవితి వస్తే అంగారక చవితిగా జరుపుకుంటారు. ఈ రోజున వినాయకుడిని పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని బుద్ధి, సిద్ధి గణపతి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు చిన్నిమధుకర్ ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, హోమం, మోదుక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు వినాయకుడిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. కాగా అంగారక చవితిని పురస్కరించుకొని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి న్యాల్‌కల్ మండలం రేజింతలోని సిద్ధి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట యువజన కాంగ్రెస్‌నాయకులు వినోద్‌పాటిల్, మాజీ ఎంపీటీసీలు రాంచందర్, పండరిరెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వరప్ప, ముదిరాజ్ సంఘంనాయకులు ఉన్నారు.

5వ తేదీలోగా ఆసరా పింఛన్ అందించాలి

- ఎంపీడీవోకు దివ్యాంగుల వినతి

వట్‌పల్లి, జూన్ 25 : ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లను ప్రతీ నెల 5వ తేదీలోగా అందించాలని కోరుతూ మంగళవారం వట్‌పల్లి ఎంపీడీవో శశిప్రభ, ఎంపీవో యూసుఫ్‌కు అందోల్ డివిజన్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సుభాష్, వట్‌పల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఖలీల్ మియా తదితరులు సభ్యులతో కలసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, ఆసరా పెంచన్లను నెల చివరిలో పంపిణీ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బాబు, కోశాధికారి అబేద్, రషీద్ మియా తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో నీటి ఎద్దడి

చిన్నశంకరంపేట, జూన్ 25: మండలంలోని అంబాజీపేటలో కొన్ని రోజుల నుంచి నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము గోస పడుతున్నా స్పెషల్ ఆఫీసర్ పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్: బీజేపీ

జహీరాబాద్, జూన్ 25: కాంగ్రెస్‌పార్టీ రాజ్యాంగ పరిరక్షణ అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్ పేర్కొన్నారు. జూన్ 25ను బ్లాక్‌డేగా పాటిస్తూ మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 25ను చీకటి దినంగా చరిత్రకెక్కించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. 1975లో జూన్ 25న కాంగ్రెస్‌పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, మానవ హక్కులను మంటగలిపిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగాన్ని మార్చారని, ఆయారాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దుచేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగపరిరక్షణ అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజల్లో చిచ్చు పెట్టేందుకు యత్నిస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షణకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కట్టుబడి ఉన్నారన్నారు.

బడికి వెళ్లాలంటే గుంతలో దిగాల్సిందే..

- చింతలపల్లిలో చిన్నారుల అవస్థలు



చింతలపల్లిలో నీటిలో నుంచే బడికి వెళ్లి వస్తున్న చిన్నారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 25: గతంలో గ్రామానికి చేరుకునేందుకు రహదారుల సౌకర్యం సరిగా లేక యేరులు దాటేవారు. కానీ నేటికీ ఇక్కడ చిన్నారులు బడికి వెళ్లేందుకు వాగు నుంచి వచ్చే నీటి గుంతను దాటక తప్పని దుస్థితి. సంగారెడ్డి మండలం చింతలపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పొలం మధ్యలో నిర్మించారు. పాఠశాల సమీపంలో వాగు ఉండడంతో చిన్న వర్షం కురిసినా వాగులో నుంచి వరద నీటి ప్రవాహం పెరుగుతుంది. చిన్నారులు బడికి వెళ్లాలంటే ఆ నీటిని దాటుకుని వెళ్లాల్సిందే. నీటి ప్రవాహం ఎక్కువైతే తమ పిల్లల పరిస్థితి ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి వాగులో నుంచి వచ్చే నీటిని కట్టడి చేసి విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, జూన్ 25: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ఉద్యోగులు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలన్నారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరువు భత్యంతోపాటు కొత్త ప్రభుత్వంలోని కరువు భత్యం మొత్తం నాలుగు విడతలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలన్నారు. షరతులతో కారుణ్య నియామకాలు పొందిన టైపిస్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరారు. నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయ చీఫ్ ఇంజనీర్ సంగారెడ్డి కార్యాలయానికి మార్చాలని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాకు తరలించిన ఫారెస్టు చీఫ్ కన్జర్వేటీవ్ కార్యాలయాన్ని వెనక్కి తీసుకురావాలంటూ డిమాండ్లపై కార్యవర్గ సమావేశంలో తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా సహ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మనోహర్, ఫజులొద్దీన్, రఘునాథ్‌రావు, లీల, ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, మెదక్, ఏడుపాయల వనదుర్గా, రామాయంపేట, చేగుంట, నర్సాపూర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



సంగారెడ్డిలోని ఐబీ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 25: జాబ్ క్యాలెండర్ విడుదలచేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీజేవైఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ వద్ద మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్-2,3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులు పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోచారం రాములు, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ద్వారకా రవి, నాయకులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి లేడు.. ప్రత్యేక అధికారి రాడు

- ప్రశ్నార్థకంగా కోహీర్ పంచాయతీ పాలన





కోహీర్ మేజర్ గ్రామపంచాయతీ భవనం, లాల్‌సాబ్‌వాడి కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన మురుగునీరు, చెత్త

కోహీర్ జూన్ 25: పంచాయతీ కార్యదర్శి లేక, ప్రత్యేక అధికారి గ్రామానికి రాక కోహీర్ గ్రామపంచాయతీ పరిపాలన గందరగోళంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన కోహీర్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రధాన విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులు లేకపోవడం వల్ల గ్రామంలోని వివిధ సమస్యలు పేరుకుపోతున్నాయి. జనవరి 30వ తేదీతో సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో కోహీర్ గ్రామ పంచాయతీకి డీఆర్డీఏ పీడీ జంగారెడ్డిని నియమించారు. అయితే మొదట్లో ఆయన కోహీర్ గ్రామపంచాయతీ పరిపాలన చూసేందుకు వచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆయన చాలా రోజులుగా ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. పారిశుధ్య పనులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నడని గత ఏప్రిల్ 8న కోహీర్ గ్రామ పంచాయతీని పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ వల్లూరు క్రాంతి కోహీర్ గ్రామపంచాయతీగా కార్యదర్శి లక్ష్మణ్‌చారిని సస్పెండ్ చేశారు. అనంతరం కోహీర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బడంపేట గ్రామానికి చెందిన కార్యదర్శి విజయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతగా కోహీర్ గ్రామపంచాయతీ విధులను అప్పగించారు. అయితే విజయ్‌కుమార్ రెండు రోజులు సెలవులపై వెళ్లి మరికొన్ని రోజులు సెలవులపై వెళ్తానని తెలపడంతో విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాడని విజయ్‌కుమార్‌ను కూడా జిల్లా కలెక్టర్ జూన్ 3న సస్పెండ్ చేశారు. తదనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా ఉన్న రఘుకు కోహీర్ గ్రామపంచాయతీ బాధ్యతలను అప్పగించారు. అతడు కూడా గ్రామంలో సమస్యలను చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రస్తుతం ఏ వీధిలో చూసినా చెత్త చెదారం, మురుగు నీటితో అపరిశుభ్రంగా మారింది. పలు కాలనీల్లో తాగునీరు, వీధిలైట్ల సమస్య ఏర్పడింది. దీంతో కోహీర్ గ్రామపాలన ప్రశ్నార్థకంగా మారింది.

ధ్రువీకరణ పత్రాల కోసం ఇక్కట్లు

కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీకి కార్యదర్శి లేకపోవడం వల్ల ప్రస్తుతం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదు. దీంతో ధ్రువపత్రాలు అవసరం ఉన్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం కోహీర్ గ్రామ పంచాయతీ బాధ్యతలు మండల పంచాయతీ అధికారికి అప్పజెప్పినప్పటికీ ఆయన సంతకం డిజిటలైజేషన్ లేకపోవడం మూలంగా ఆన్‌లైన్ ద్వారా జారీ చేయాల్సిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు రావడం లేదు.



రంగంపేట జడ్పీహెచ్ఎస్‌లో మాట్లాడుతున్న మెదక్ డీఈవో

రంగంపేట పాఠశాల ఉపాధ్యాయుల తీరు భేష్

- మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొ.రాధాకిషన్

కొల్చారం, జూన్ 25: మంచి బోధన, కఠోర శ్రమతోనే ఉత్తమ ఫలితాల వస్తాయని మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాకిషన్ పేర్కొన్నారు. మండలంలోని రంగంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పది మంది విద్యార్థులకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా 10 జీపీఏ సాధించిన నందినితో పాటు తొమ్మిది ఆపైన జీపీఏ సాధించిన 9మంది విద్యార్థులు భూపాల్, వైష్ణవి, శృతిలయ, నాగశ్వేత, భవాని, అంజలి, హర్షిత, రవళి, పావనిలను డీఈవో శాలువా కప్పి సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రంగంపేట జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. కార్యక్రమంలో ఏఎంవో సుదర్శన్‌మూర్తి, ఎంఈవో నీలకంఠం, ఉపాధ్యాయ బృందం, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల రిజిస్ట్రేషన్

- మెదక్ జిల్లా మత్స్యసహకార అధికారి

కౌడిపల్లి, జూన్ 25: ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులను రిజిస్ట్రేషన్ చేస్తామని మెదక్ జిల్లా మత్స్యశాఖ ఏడీఏ నర్సింహారావు పేర్కొన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంతకాలం క్రితం మండలంలోని సదాశివపల్లి శివారు ప్రాంతంలోని కనికల చెరువును మత్స్య సహకార సొసైటీలో రిజిస్ట్రేషన్ కాగా తమకు కనికల చెరువులో వాటా వస్తుందని వెల్మకన్నె గ్రామస్థులు అభ్యంతరం తెలిపారని చెప్పారు. దీంతో ఇరు గ్రామాల సొసైటీ సభ్యులను తహసీల్ కార్యాలయం వద్ద చర్చలకు పిలిచి ప్రభుత్వ సూచనల ప్రకారం శివారు అధికంగా ఉన్న గ్రామం సదాశివపల్లికి వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌడిపల్లి తహసీల్దార్ అంజనేయులు, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌రెడ్డితో పాటు ఇరు గ్రామాల ముదిరాజ్ సంఘ సభ్యులు ఉన్నారు.

రామాయంపేటలో వాహనాల తనిఖీ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా రవాణాశాఖ అధికారి

రామాయంపేట, జూన్ 25: రామాయంపేట రహదారిపై మంగళవారం జిల్లా రోడ్డు రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టాక్సు చెల్లించని ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వాహనదారులకు ఆయన రోడ్డు భద్రతపై వివరించారు.

ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ మాయని మచ్చ



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

మెదక్ అర్బన్, జూన్ 25: దేశంలో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ భారత్‌కు మాయని మచ్చగా నిలిచిందని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాస్వామ్యానికి చీకటి రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని అణిచివేసి, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించి, దేశాన్ని జైలుగా మార్చిన ఆ చీకటి రోజులను ఎన్నటికి మర్చిపోలేమన్నారు. ప్రతికా స్వేచ్ఛను నాశనం చేయడానికి ఎన్నో బిల్లులు తీసుకొచ్చారని మండిపడ్డారు. ఫెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఇందిరాగాంధీని ఈ దేశం ఎప్పటికీ క్షమించదన్నారు. నేటికీ కాంగ్రెస్ తన వ్యవహారశైలిని మార్చుకోలేదన్నారు. మన భావితరాలకు కాంగ్రెస్ పార్టీ వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రాగి రాములు, ఓబీసీ మోర్చా, మహిళా మోర్చా అధ్యక్షుడు కాశీనాథ్, వీణ, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఝరాసంగంకు మంత్రి దామోదర్ రాక

ఝరాసంగం, జూన్ 25: ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల పరిధిలోని ఎల్గోయి, ముంగి గ్రామాలకు చెందిన 211మంది నిమ్జ్ భూబాధితులకు చెక్కులు అందజేయనున్నారు. బుధవారం మండలకేంద్రంలోని వాసవికల్యాణ మండపంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేయనున్నట్టు తహసీల్దార్ సంజీవరావ్ తెలిపారు.

ఎస్సీ యువతకు ఉపాధి ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జనవరి 13: ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ బ్రాంచ్ మేనేజర్ ఆసిఫా బేగం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ కోర్సులను మూడు నెలల వ్యవధిలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె పేర్కొన్నారు. వీటితో పాటు ఇంగ్లీష్ టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, డీసీఏ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సీసీ కెమెరాలు తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల వరకు వయస్సు గలవారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు సంగారెడ్డిలోని రాజీవ్ పార్కు సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలన్నారు. పూర్తి సమాచారం కోసం 8309940165 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నిజాంపేట/చిన్నశంకరంపేట, జూన్ 25: మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం యాంటీ డ్రగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి సత్ప్రవర్తనతో చదువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, ఆలీ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజం డ్రగ్స్ దుర్వినియోగం ప్రభావం అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలి

నారాయణఖేడ్, జూన్ 25: ఖేడ్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానిక జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ కోరారు. మంగళవారం ఆమె ఖేడ్‌లోని బాలికల పాఠశాలను సందర్శించారు. మన బస్తీ, మనబడి పథకం ద్వారా పాఠశాలలో వసతుల కల్పనకు రూ.45 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో టాయిలెట్స్ బ్లాక్‌నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులుచేపట్టారు. ఈ పనులు అసంపూర్తి దశలో నిలిచినట్టు తెలిపారు. సంప్ పనులుపూర్తి అయినా నీటిసదుపాయం కల్పించకపోవడంతో అది నిరుపయోగంగా మారిందన్నారు. పాఠశాలలో అసంపూర్తి పనులను సత్వరమే పూర్తి చేయించి, విద్యార్థినుల సమస్యలను దూరం చేయాలన్నారు. ఆమె వెంట మాజీ విజిలెన్స్ కమిటీసభ్యులు రవీందర్‌నాయక్, పాఠశాల హెచ్‌ఎం.యాదవరెడ్డి, అంజాగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిగులు పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

నారాయణఖేడ్, జూన్ 25: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో ఉపాధ్యాయులు బదిలీ అయిన చోట జాయిన్ కాకుండా ఉండే మిగులు పోస్టులను ప్రభుత్వం తక్షణమే సీనియారిటీ జాబితాలో తదుపరి ఉన్న ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ జాదవ్ కోరారు. ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో 12ను సవరించి, పీఎస్ హెచ్‌ఎం పోస్టులను డీఈడీ చేసిన వారికి సైతం అర్హులుగా గుర్తించి పదోన్నతులు కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఏశప్ప, నరేష్, అనురాధ, మండలాల బాధ్యులు రాజు, అంజయ్య, జ్యోతిలింగం, అప్పారావు, సర్దార్, శ్రీరాంనాయక్, రాములు, వాసునాయక్, శివకుమార్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.33 కోట్ల రుణాలు

మాసాయిపేట, జూన్ 25: 2024-25 ఆర్థిక సంవత్సరంలో మాసాయిపేట వెల్దుర్తి ఉమ్మడి మండలాలకు కలిపి బ్యాంకు లింకేజీల ద్వారా మహిళా గ్రూపులకు రూ.33 కోట్ల రుణాలను అందించడానికి రుణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఏపీఎం శంకరయ్య వెల్లడించారు ఆయన మంగళవారం మాసాయిపేటలో మాట్లాడారు. మాసాయిపేట వెల్దుర్తి ఉమ్మడి మండలాలకు కలిసి వివిధ బ్యాంకు బ్రాంచీల ద్వారా సుమారు 900 మహిళా గ్రూపులకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను అందించనున్నట్లు తెలిపారు. దీనికై ప్రతిపాదనలు సిద్ధం చేసి రుణ ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. తీసుకున్న రుణాలను సాధ్యమైనంత త్వరగా చెల్లించి తిరిగి రుణాలను పొందాలని శంకరయ్య మహిళా సంఘాలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్: బీఆర్ఎస్

జహీరాబాద్, జూన్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించడంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎస్సీసెల్ నియోజక వర్గం అధ్యక్షుడు బండిమోహన్, నాయకులు నాయకిరణ్, యాకూబ్, శ్రీకాంత్ తదితరులు పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కొత్తపథకాల సంగతి పక్కనబెడితే, ఉన్న సంక్షేమపథకాలనైనా సక్రమంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆసరా, దివ్యాంగుల పెన్షన్లను కూడ సక్రమంగా ఇవ్వడంలేదని విమర్శించారు. రైతులకు వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికి ఈఏడాది జూన్-జూలై సీజన్‌కు సంబంధించిన రైతుబంధును ఇంకా రైతుల ఖాతాల్లో వేయలేదన్నారు.